## క్లుప్తంగా

### గ్రామ దేవతలకు పూజలు



సుద్దమల్లలో చౌడేశ్వరి దేవికి పూజలు చేస్తున్న భక్తులు

**ఉయ్యాలవాడ:** మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలు ఉగాది పండుగ అనంతరం గ్రామదేవతలైన పెద్దమ్మ, గంగమ్మ, మారెమ్మ, సుంకులమ్మ, చౌడేశ్వరి దేవిలకు పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మంగళవారం కాకరవాడ, సుద్దమల్ల, బోడెమ్మనూరు, ఉయ్యాలవాడ, తుడుమలదిన్నె, మాయలూరు, ఆయా గ్రామాల్లో వెలిసిన అమ్మవార్లకు బోనాలు నైవేద్యంగా సమర్పించి నూతన తెలుగు సంవత్సరంలో పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

### ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం



బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

**గోస్పాడు:** ప్రతి ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమని, పని చేసిన చోట నిజాయతీగా వ్యవహరించి ప్రజల మన్ననలు పొందాలని ఈఓఆర్డీ నాగఅనసూయ సూచించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధి హామీ పథకం సిబ్బందిని మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడికెళ్లినా నిజాయతీగా పని చేస్తే గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

### వ్యక్తిగత సమాచారం భద్రంగా ఉంచుకోవాలి

**బొమ్మలసత్రం:** యువత తమ వ్యక్తిగత సంచారం అపరిచితులతో పంచుకోరాదని, అనుమానాస్పద కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని నంద్యాల తాలూకా ఎస్‌ఐ ధనమ్మ తెలిపారు. మంగళవారం గురురాజ బ్యాంక్ కోచింగ్ సెంటర్‌లో సైబర్ నేరాలు, స్వీయ సంరక్షణ గురించి ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోరాదని, బ్యాంక్ లావాదేవీల విషయాలు, ఓటీపీ తదితర వాటిని ఎవరికీ షేర్ చేయరాదన్నారు. మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

### ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఈ రమేష్‌కుమార్

**నంద్యాల(అర్బన్):** ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని నంద్యాల విద్యుత్ శాఖ డిప్యూటీ ఈఈ రమేష్‌కుమార్ అన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ పదవీ విరమణను పురస్కరించుకుని మంగళవారం స్థానిక కార్యాలయ ఆవరణంలో ఆయనను ఘనంగా సన్మానించారు. రమేష్‌కుమార్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అని, ఉద్యోగంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ సుధాకర్‌కుమార్, ఏఈ రామయ్య, లైన్‌ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, లీలాకుమార్, లైన్‌మెన్ రమణయ్య పాల్గొన్నారు.

### జార్ఖండ్ మహిళ ఆత్మహత్య

**బేతంచెర్ల:** జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బేతంచెర్ల అయ్యలచెర్వులో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం సాలీగూటు గ్రామానికి చెందిన హైబురు, భార్య చంద్రటియూ (35) నాలుగు నెలల క్రితం అయ్యలచెర్వుకు వచ్చారు. ఇక్కడున్న పాలీస్ ఫ్యాక్టరీలో హైబురు పనిచేస్తున్నాడు. పాలీస్ ఫ్యాక్టరీకి చెందిన ఓ గదిలో ఇద్దరూ నివాసం ఉంటున్నారు. మంగళవారం భర్త పనికి వెళ్లగా ఆమె ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఇంటికి వచ్చి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దించి కొన ఊపిరితో ఉన్న ఆమెను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని.. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### నేటి అర్ధరాత్రి నుంచి జ్యోతి మహోత్సవం

**బనగానపల్లె:** నందవరం చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి జ్యోతి మహోత్సవాలు జరగనున్నాయి. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొగటవీర క్షత్రియులు గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద నుంచి గోధుమ పిండి, నెయ్యి, బెల్లంపాకంతో తయారు చేసిన పదార్థంలో జ్యోతిని వెలిగించుకుని తలపై పెట్టుకుని భక్తి గీతాలు ఆలపిస్తూ గురువారం ఉదయానికి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నడిచి వెళ్లనున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించనున్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

---

- ఆందోళనలో రైతన్న
- ఉప ప్రధాన కాల్వల్లో పారని నీరు
- కీలక దశలో పంటలు

# అడుగంటిన గంగ

**రుద్రవరం:** తెలుగుగంగ ప్రధాన కాల్వలో సాగు నీరు అడుగంటింది. దిగువకు నీరు పారక రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు వాడుముఖం పట్టాయి. మరి కొద్ది రోజులు నీరందకపోతే సాగు చేసిన పంటలన్నీ ఎండి నష్టాల్లో కూరుకుపోతామన్న భయం రైతుల్లో నెలకొంది. ఇళ్ల వద్ద పనులు వదిలి ఏదో ఓ రకంగా నీరు పారించుకొని పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రి పగలు నిద్ర మేల్కొని పొలాల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

మండలంలో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, బోరు మోటర్లు, తెలుగుగంగ ప్రధాన, ఉప ప్రధాన కాల్వలపై ఆధారపడి రైతులు రబీ సీజన్ కింద దాదాపు 9,800 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. అందులో ప్రధానంగా 4900 హెక్టర్లలో వరి సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంటలన్నీ కీలక దశలో ఉన్నాయి. గత నెలలో మొదటి వారం వరకు ప్రభుత్వం తెలుగుగంగ ప్రధాన కాల్వ ద్వారా సాగు నీటిని వార బంది పద్ధతిలో విడుదల చేసింది. అదే నెలలో రెండో విడత వార బందీ ద్వారా నీరు విడుదల చేయడంలో అధికారులు జాప్యం చేశారు. వెలుగోడు జలాశయం వద్ద గేట్లు ఎత్తేందుకు జనరేటర్ పని చేయలేదన్న సాకుతో అరకొరగా నీటిని విడుదల చేశారు. ఆ అరకొర నీరు మధ్యలోనే ఆగిపోయింది. కాస్త ఆలస్యం అయినా నాలుగు రోజుల క్రితం కాస్త సామర్థ్యం పెంచి మరికొంత నీటిని విడుదల చేశారు. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ ఒక్క తడి పారించుకుంటే పంటలు పండుతాయని ఆశించారు. అయితే ఉన్న ఫలంగా కాల్వలో నీటి పారుదల అడుగంటడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. దిక్కు తోచని స్థితిలో పడిపోయారు.



19వ బ్లాక్ తూము వద్ద ప్రధాన కాల్వలో అడ్డుకట్ట వేసిన దృశ్యం

సాగునీటి కోసం పలు గ్రామాల రైతులు ఏకమయ్యారు. చిన్నకంబలూరు, బి.నాగిరెడ్డిపల్లె, రుద్రవరం, కొత్తపల్లె, ఆర్.నాగులవరం తదితర గ్రామాలకు చెందిన రైతులు గుంపులుగా తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపైకి చేరుకున్నారు. అరకొరగా పారుతున్న నీటికి అడ్డుకట్ట వేసి 19వ బ్లాక్ తూముకు మళ్లించుకున్నారు. అక్కడి నుంచి దిగువకు అరకొరగా పారుతున్న నీటిని 20వ బ్లాక్ తూము రాళ్లను అడ్డుగా పేర్చుకొని పారించుకుంటున్నారు. అక్కడి నుంచి దిగువకు నీరు పారక మిగిలిన ఉప కాల్వల్లో నీరు పారక ఎండిపోయాయి. ఈ తంతు సాగుతుండగా ఎండ తీవ్రతకు బి.నాగిరెడ్డిపల్లె, రుద్రవరం, శ్రీరంగాపురం, మాచినేనిపల్లె, కొండమాయపల్లె, టీ.లింగందిన్నె, ఆర్.నాగులవరం, నక్కలదిన్నె, చందులూరు, మందలూరు తదితర గ్రామాల పరిధిలో రైతులు సాగు చేసిన వరి, మినుము, కొర్ర, సజ్జ వంటి పంటలు వాడు ముఖం పట్టాయి. మరి కొద్ది రోజులు ఇదే పరిస్థితి నెలకొంటే పంటలన్నీ ఎండిపోయే ప్రమాదముంది.





20వ బ్లాక్ తూము వద్ద ప్రధాన కాల్వలో పారని నీరు, బి.నాగిరెడ్డిపల్లె మెట్ట వద్ద ఎండుతున్న మినుము

### మరో పది రోజులు నీళ్లివ్వాలి



తెలుగుగంగ కాల్వలకు మరో పది రోజుల పాటు సాగునీరు విడుదల చేయాలి. లేదంటే కీలక దశలో ఉన్న వరి దెబ్బ తింటుంది. నేను 21వ బ్లాక్ కాల్వ కింద లక్ష రూపాయల పెట్టుబడితో రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాను. ప్రస్తుతం పంట కంకి దశలో ఉంది. చివరగా ఒక్క తడి నీరు పారిస్తే పంట పండుతుంది. అయితే తడి పారించుకుందామనుకునే లోపే కాల్వలో నీటి ప్రవాహం నిలిచిపోయింది. దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. అధికారులు స్పందించి మరి కొద్ది రోజులు సాగు నీటిని విడుదల చేయించి ఆదుకోవాలి.

– వెంకటసుబ్బయ్య, రైతు, టీ.లింగదిన్నె

### ప్రభుత్వం స్పందించాలి



రైతులు నట్టేట మునగకుండా ప్రభుత్వం స్పందించి తెలుగుగంగ ప్రధాన కాల్వకు సాగు నీరు విడుదల చేయించాలి. సాయం లేదు, గిట్టుబాటు ధర లేదు కనీసం చివరి తడి పారించుకునేందుకు సాగునీరైనా ఇచ్చి ఆదుకోవాలి. నేను లక్షలాది రూపాయల పెట్టుబడులతో ఆరెకరాల్లో వరి, మినుము పంటలు సాగు చేశాను. పంటలు కీలక దశలో ఉన్నాయి. ఇప్పుడు నీటి తడి ఇవ్వకపోతే తీవ్ర నష్టం తప్పదు.

– రమణ, రైతు, శ్రీరంగాపురం

---

### వెలవెలబోయిన జూనియర్ కాలేజీ

**శిరివెళ్ల:** యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మంగళవారం ప్రారంభమైంది. కళాశాల లో 80 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులుండగా 20 మంది మాత్రమే హాజరయ్యారు. అధ్యాపకులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి కళాశాలకు రమ్మని పిలిచినా స్పందన కానరాలేదు.

### ఉపాధి హామీ లక్ష్యాలు సాధించాలి

**నంద్యాల:** ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక దృష్టి సారించి కేటాయించిన లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఎంపీడీఓ, ఏపీడీలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉపాధి హామీ పనుల లక్ష్య ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు కలెక్టరు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 537 పశువులకు నీటితొట్ల నిర్మాణాలను ఈనెల 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన 2,500 సేద్యపు నీటి కుంటల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు 20 శాతం ఉపాధి కూలీలు సేద్యపు నీటి కుంటల పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలం వచ్చేలోపు పంట కాలువ పనులను పూర్తి చేయించాలన్నారు.

### నేటి నుంచి బండలాగుడు పోటీలు

**గోస్పాడు:** ఉగాది పండుగను పురస్కరించుకొని గుమ్మిత మల్లికార్జున, వీరభద్రస్వామి తిరునాల సందర్భంగా పామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస రెడ్డిల జ్ఞాపకార్థం బుధవారం నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు మార్క్ ఫెడ్ రాష్ట్ర మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సీనియర్, న్యూకేటగిరి, పాలపండ్ల విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

---

## గ్రామ దేవతలకు బోనాలు



చాగలమర్రి పెద్దమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు



శ్రీరంగాపురం పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులు

**చాగలమర్రి:** ఉగాది పండుగ పురస్కరించుకొని చాగలమర్రితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ దేవతలైన చాగలమ్మ, పెద్దమ్మ, గంగమ్మ, మారెమ్మ, చౌడేశ్వరి దేవి, నల్లాలమ్మకు భక్తులు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. చాగలమర్రిలో పెద్దమ్మకు భక్తులు చీర, సారెతో పాటు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి నూతన సంవత్సరంలో పాడి పంటలతో గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా విరజిల్లాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. ఆయా గ్రామాలకు చెందిన పుర ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పోలేరమ్మ జాతర**

**రుద్రవరం:** మండల పరిధిలోని శ్రీరంగాపురంలో మూడు రోజులుగా పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రెండో రోజు పూజలు చేసి ఆరు పండ్ల విభాగం వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. మూడో రోజు మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించి విశేష పూజలు చేశారు. అలాగే న్యూ కేటగిరీ వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. రెండు విభాగాల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. బుధవారం వివిధ రకాల పోటీలు నిర్వహించి జాతరను ముగించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

## రైతు సదస్సులను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సోమన్న

**నంద్యాల(న్యూటౌన్):** ఈనెల 4న కర్నూలు నగరంలో జరిగే జాతీయ స్థాయి రైతు సదస్సులను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పార్లమెంట్‌లో చట్టం తీసుకు రావాలన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 60 ఏళ్లు నిండిన రైతుకు రూ.10 వేల ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, కేరళ తరహాలో రైతులకు సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్నూలులో జరిగే రైతు సదస్సుకు నంద్యాల జిల్లా నుంచి పెద్ద ఎత్తున రైతులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు మల్లికార్జున, బాషా, షేక్షావలి పాల్గొన్నారు.

## పెద్దమ్మ ఆలయంలో భక్తుల సందడి

**దొర్నిపాడు:** ఉగాది పర్వదినం పురస్కరించుకొని మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు భక్తులు మంగళవారం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులంతా పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని సందడి చేశారు. ఈ ఏడాది జూన్ 8, 9, 10 తేదీల్లో పెద్దమ్మ దేవర నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, చిన్నపెద్దన్న, గ్రామ పెద్దలు నిర్ణయించారు. మే 11న అమ్మవారికి ముడుపు కడుతున్నందున అప్పటి నుంచి మొక్కులు చెల్లించేందుకు అవకాశం లేకపోవడంతో ఇప్పుడే మంచిదని భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పెద్దమ్మ దర్శనం కోసం వచ్చిన భక్తులు

## లక్ష్మీరంగనాథుడికి భారీగా ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

**జూపాడుబంగ్లా:** తర్తూరు లక్ష్మీరంగనాథస్వామికి భారీగా ఆదాయం సమకూరింది. ఈనెల 6 నుంచి జాతర ప్రారంభం కానుండటంతో టెంకాయలు, లడ్డూప్రసాదం విక్రయం, కొబ్బరి చిప్పల పోగు చేసుకునేందుకు మంగళవారం ఆలయంలో వేలం పాటలు నిర్వహించారు. టెంకాయల విక్రయ హక్కులను నందికొట్కూరు రాజేష్ రూ.5,90,000లకు, లడ్డూప్రసాదాల విక్రయ హక్కులను కొణిదేల రంగస్వామి రూ.1,05,00లకు, కొబ్బరి చిప్పలపోగు హక్కును కొణిదేల బాలన్న రూ.2,00,000లకు దక్కించుకున్నారు. వేలం పాటల ద్వారా మొత్తం రూ.8,95,000ల ఆదాయం సమకూరింది. ఈసందర్భంగా ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి మాట్లాడుతూ వేలం పాటదారులు ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు మాత్రమే టెంకాయలు, లడ్డూప్రసాదాలు, కొబ్బరిచిప్పలపోగు చేసుకోవాలన్నారు. పెద్దసైజు టెంకాయ రూ.30ల చొప్పున విక్రయించాలన్నారు. 70 గ్రాముల బరువున్న లడ్డూ ప్రసాదం రూ.15ల చొప్పున విక్రయించాలన్నారు. కమిటీ సూచించిన ధరలకంటే అధికంగా విక్రయిస్తే వేలం రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**జూపాడుబంగ్లా:** పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సంతగేటు, బండ్లమెట్ట నిర్వహణకు వేలంపాటలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన రాజు రూ.1,91,000లకు పాట పాడి హక్కులను దక్కించుకున్నారు.ఈఓపీఆర్డీ సంజన్న, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, సర్పంచ్ బాలయ్య, సచివాలయ కార్యదర్శి శరత్ పాల్గొన్నారు.

### 5న మండల మీట్

**ఉయ్యాలవాడ:** ఈ నెల 5వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అజెండాలో పొందుపరచిన తాగు నీటి సమస్యపై సమావేశంలో చర్చకు రానున్నట్లు వెల్లడించారు.

### 91.12 శాతం పింఛన్ల పంపిణీ

**శిరివెళ్ల:** మండలంలో మొదటిరోజు 91.12 శాతం మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప మంగళవారం తెలిపారు. మొత్తం 7,891 పింఛన్లకుగాను 7,190 మందికి సొమ్ము పంపిణీ జరిగిందన్నారు. అత్యధికంగా శిరివెళ్ల–1వ సచివాలయంలో 485 మందికి గాను 467 మందికి (96.29 శాతం), అత్యల్పంగా బోయలకుంట్లలో 414 మందికిగాను 347 మందికి(83.82 శాతం) పింఛన్లు అందజేసినట్లు వివరించారు. మిగిలిన వారికి 2వ తేదీ కూడా పింఛన్ల పంపిణీ కొనసాగుతుందన్నారు.

**జిల్లాలో 93 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి**

**నంద్యాల(న్యూటౌన్):** జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 93 శాతం పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 2,14,590 మంది పింఛనర్లు ఉండగా రూ.85.41 కోట్లు మంజూరు చేసినట్లు పీడీ తెలిపారు. మొదటి రోజు 1,99,237 మందికి పంపిణీ చేశామన్నారు.

### ప్రణాళికలు రూపొందించండి

**నంద్యాల:** ఈ ఆర్థిక సంవత్సరం వాస్తవ జీడీపీకి అదనంగా 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు రూపొందించి, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ అధికారి, ఆర్థిక శాఖ రాష్ట్ర కార్యదర్శి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల స్థూల జాతీయోత్పత్తి 15 శాతం వృద్ధిరేటుపై జిల్లా కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగంతో పాటు అనుబంధ రంగాలు ఉద్యాన, పాడి పరిశ్రమ, చేపల పెంపకం తదితర రంగాలను విస్తృతంగా అభివృద్ధి చేయాలన్నారు. రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభం వచ్చేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించామని, కానీ నిర్మాణం మాత్రం జరగలేదని జిల్లా స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్ పాల్గొన్నారు.

### సర్వేలను త్వరగా పూర్తి చేయండి

**నంద్యాల:** గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సర్వేలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సచివాలయ సర్వీసులు, ఉపాధి హామీ, హౌసింగ్ అంశాలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన 7 వేల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా, మండలాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, హౌసింగ్ ఈఈ శ్రీహరి గోపాల్ పాల్గొన్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్ట్

**బండిఆత్మకూరు:** మండల పరిధిలోని వెంగళరెడ్డిపేటకు చెందిన ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఎర్రన్నతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.15,380 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

## హమ్మయ్యా.. ఓ పనైపోయింది!



రుద్రవరంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



విజయ సూచిక చూపుతున్న బాలికలు

**ఉయ్యాలవాడ/రుద్రవరం/దొర్నిపాడు:** రాష్ట్రవ్యాప్తంగా మార్చి 17న ప్రారంభమైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం చివరి రోజు సోషల్ పరీక్షతో ముగిశాయి. పరీక్షలు ముగియడంతో విద్యార్థుల ఆనందాలకు హద్దులే లేకుండా పోయాయి. చివరి రోజు ఆయా కేంద్రాల్లో పరీక్షలు రాసిన విద్యార్థులు సంతోషంగా ఒకరిపై మరొకరు చేతులు వేసుకొని బయటకు వచ్చారు. బయట దుకాణాలు, బేకరీల వద్దకు వెళ్లి శీతల పానీయాలు, ఐస్‌లు, తినుబండారాలు కొనుగోలు చేసి ఒకరికొకరు పంచుకుంటూ ముచ్చటించుకున్నారు. సంతోషంగా తోటి విద్యార్థులతో మిత్రమా వెళ్లొస్తాం, మళ్లీ కలుస్తాం అంటూ ఒకరినొకరు వీడ్కోలు చెప్పుకొని ఇళ్లకు చేరుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్ అధికారి నరసింహుడు, సుధాకర్ తెలిపారు.

## పింఛన్ పంపిణీని పరిశీలించిన ఆర్థిక శాఖ సెక్రటరీ

**నంద్యాల(అర్బన్):** సామాజిక పింఛన్ పంపిణీని మంగళవారం ఆర్థిక శాఖ సెక్రటరీ, జిల్లా ఇన్‌చార్జ్ అధికారి నివాస్ పరిశీలించారు. రాయమల్పాపురం గ్రామంలో, నంద్యాల వీసీ కాలనీలో జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి పర్యటించి పింఛన్ల పంపిణీని పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ రాయమల్పాపురం గ్రామంలోని ఓ వృద్ధురాలిని ఆరా తీశారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల తాగునీటి తొట్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు ఏఏ సర్వీసులు అందిస్తున్నారని డిజిటల్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య ఉన్నారు.



పెన్షన్ విధానాన్ని పరిశీలిస్తున్న ఆర్థిక శాఖ సెక్రటరీ నివాస్

## కూల్‌డ్రింక్స్ జోలికి వెళ్లొద్దు

**నంద్యాల(న్యూటౌన్):** కూల్‌డ్రింక్స్ జోలికి వెళ్లకుండా సహజ పానియాలు తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గోపాల్, గౌరవ సలహాదారు రామరాజు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పీవీప్రసాద్ సూచించారు. కూల్‌డ్రింక్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వారు మంగళవారం సాయిబాబానగర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూల్‌డ్రింక్స్‌లో హానికరమైన క్రిమిసంహారక మందుల అవశేషాలన్నాయని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థలు పలు నివేదికలో వెల్లడించాయన్నారు. వాటి జోలికి వెళ్లకుండా చల్లని మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లను తాగాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు రమణ, ఖాజా, సంజీవ్‌కుమార్, పునీత్, బాలు, వీరసేన, బాలహుసేని, రమణ తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబానగర్‌లో నిరసన జేస్తున్న జేవీవీ నాయకులు

## తేనెటీగల పెంపకంపై ముగిసిన శిక్షణ

**కొత్తపల్లి:** మండలంలోని పాలెం చెరువు గూడెంలో తేనెటీగల పెంపకంపై ఏడు రోజులుగా ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం.జాన్సన్ మాట్లాడుతూ తేనెటీగల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు పాటించి లాభాలు సాధించవచ్చన్నారు. తేనెటీగల పెంపకం చేపట్టినట్లయితే పంట సాగులో పుష్పాలు బాగా ఫలదీకరణం చెంది అధిక దిగుబడి పొందటానికి దోహదపడడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం శిక్షణ పొందిన రైతులకు తేనెటీగల పెట్టెలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆంజనేయ, ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ కేజీ నాయక్, సర్పంచ్ మసమ్మ, వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.అశోక్‌కుమార్, కె.మోహన్ విష్ణువర్ధన్, మండల వ్యవసాయ అధికారి మహేష్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

## అలివి వలలు వేస్తే కఠిన చర్యలు

**కొత్తపల్లి:** కృష్ణా నది తీరం వెంట అలివి వలలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మత్స్య శాఖ అధికారి భరత్‌లాల్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని సంగమేశ్వరం పరిసర ప్రాంతంలోని కృష్ణానది తీరాన్ని పరిశీలించారు. స్థానిక వీఆర్వో వేణుగోపాల్‌తో కలిసి కృష్ణా తీరం వెంట పర్యటించి అలివి వలలు వేస్తున్న నిర్వాహకులు, మత్స్యకారులతో మాట్లాడారు. ఉన్నతాధికారులు, స్థానిక తహసీల్దార్ ఆదేశాల మేరకు నదిలో చేపలు మాత్రమే పట్టాలని, అలివి వలలు వేస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని జాలర్లను హెచ్చరించారు.



అలివి వలల నిర్వాహకులు, మత్స్యకారులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి